రైతుజోల

పర్వతనేని వేంకటేశ్వరరావు

8

3713

S. R. Thirumala. 27.12.45

రైతు జ్వాల

రైతు లేకున్న భూమివారాశిగలియు
రైతు లేకున్న సస్యాల రాణచెడును
రైతు లేకున్న అన్నమే రాదు ప్రజకు
....

3713

రచయిత.
పర్వతనేని వేంకటేశ్వరరావు
తెలుగు తోట
బెజవాడ.

హక్కులు నావే, 0-8-0

అంకితము

అశేష

రైతుజన బాంధవులు

త్యాగమూర్తులు

దేశసేవానురంధరులు

అగు

శ్రీయుత

ఆచార్య రంగా గారికి

భక్తివిశ్వాసములతో

—రచయిత.

తెలుగు తోట 8 వ పుష్పము.

1944 సం॥ జూన్. 1000 ప్రతులు.

యస్. వి. యస్. ప్రెస్. బెజవాడ.

3713 — 630.174
Checked '77
శ్రీ. గ్రం. సం.
గ్రంథాలయము
కూచిపూడి

అభినందనము

సీ॥ శ్రీకరంబై యశశ్శ్రీరాజితంబగు
కమ్మవంశము సార్థకంబుగాంచె
మహనీయతత్కుల మాణిక్యమనజాలు
చంద్రాఖ్యవంశ్యులు సరసగుణులు
వెంకటనరసింహ వీరునితనయుండు
విద్యలసాగరు విధముకతన
రహిని విద్యాసాగరాఖ్యతో నొప్పారి
అధిక మేధావియై యలరుచుండు

తే॥ గీ॥ సత్యశాంతి దయాదాన సరసవాక్య
నిపుణమతియగు నాతని నెన్నతరమె
చదువులందుమాత్రమే కాదు సాగరుండు
వర్తనంబున గంభీర వార్ధియతడు:

కం॥ శ్రీసతి కెనయగు దీప్తిని
భాసురదుర్గాన్నపూర్ణ భార్యామణిసా
వాసముతన్నుయశశ్శ్రీ
వాసితుజేయగ సిరులను భాసిలునతడున్.

తే॥ గీ॥ ప్రాచ్య విజ్ఞాన సంపర్క భాసురుండు
నగుచు పాశ్చాత్య విద్యలయందుగూడ
పట్టభద్రుండై యశమున వరలువాడు
సరసగుణుడు సత్కీర్తి విశారదుండు.

తే॥ గీ॥ సరస ఫలముల వెలయించి కరము తెలుగు
వాణికి విమలభూషణావళులనొసగి
చిన్నవయసున నున్నను చెన్నుమీరు
తెలుగుతోటకు సీతడు వెలుగునిచ్చె

తే॥ గీ॥ శాశ్వతైశ్వర్య భోగముల్ జగతిలోన
నిత్యకళ్యాణ విభవముల్ నియతిగాంచి
సర్వసంసిద్ధి ప్రదుడవౌ సాగరాఖ్య!
గాంధిదేవుడు మిముఁ బ్రోచు కరుణాతోడ.

మా గ్రంథమండలికి 200 రూప్యములు బహూకరించిన దాత

శ్రీశ్రీశ్రీ చంద్రా విద్యాసాగరయ్య చౌదరిగారు, B. A., చల్లపల్లి

వినండి

నేను కమ్మబిడ్డను, నేను కాపుబిడ్డను అని పేరుపెట్టుకొనే రోజులు పోయినవి. ఎవరవునీవు? నేను రైతుబిడ్డను, నీవెవరవు? నేను కార్మికుణ్ణి మీరెవరు? మేము భారతీయులం. అని చెప్పుకునే రోజులొస్తున్నాయి ఒచ్చాయికూడా. ఇల్లాంటిసమయంలోకూడ మునలమ్మల్లాగ మూలకూర్చుంటే తమ బుద్ధిమాంద్యాన్ని బయటపెట్టుకోవడమవుతుంది. చీమ మొదలుకొని సీమలో సింహాసనం మీది ప్రభువువరకూ రైతురక్తాన్ని పంచుకుని పీలుస్తూనేవున్నారు. రాజ్యానికి వెన్నెముక రైతు. లోకానికి ప్రాణదాత రైతు రైతు నాగలిమీదనే యీ ప్రపంచమంతా ఆధారపడివుందన్న విషయం మర్చిపోయి అలాంటి రైతునే అమాయకుణ్ణిచేసి అణగద్రొక్కి ప్రజలోకి రాకుండా చేస్తున్నారు. ఇది చాల గర్హింపవలసిన విషయం.

ప్రస్తుతం భారతదేశంలో రైతుఅనుభవిస్తూన్న అగచాట్లను సమాజంలో అతని దీనస్థితినిగాంచి తపిస్తున్న హృదయంతో ఆపుకోలేని ఆవేదనతో యీ గ్రంథరచనకు పూనుకొన్నాను.

—గ్రంథకర్త.

రైతు జ్వాల

సీ॥ హలమునుం జేపట్టి పొలమును దున్నెనా
ధాన్యంపు రాసులు ధరజనించు
మచ్చిక పశువుల పచ్చిక మేపెనా
కుంభ వర్షంబుల్గాం గురియుపాలు
కర్రను నిలంబెట్టి కాలూని నిల్చెనా
సస్యంపు జవరాలు జలదరించు
కూలీల చూపుతో కొసరించి చూచెనా
అధికంపు టుత్పత్తి యతిశయించు

తే॥ గీ॥ భరతభూమికి బంగారుపట్టియతండు
సర్వమానవ కళ్యాణశాలి యతండు
నిఖిల జీవులఁబ్రోచెడి నేతయతండు
జగతి వెలసెడి కర్షక చక్రవర్తి.

దేశానికి రైతు వెన్నెముక. సకల సస్య లక్ష్మి సందోహానికీ, కర్షకుండు ప్రాణదాత. నిఖిల జీవ సంతానానికీ, కృషీవలుండు జీవనదాయి. సర్వ

మానవ కల్యాణ సముపార్జనకు వ్యవసాయదారుడు మూల స్తంభము. ధరా మండలానికి ధాన్యాది ఆహార పదార్థాలను సేకరించి ఇచ్చి జాతి నిర్మాణానికీ, సంఘచైతన్యానికీ రైతురాజుజీవగఱ్ఱ.

అయితే భారత దేశంలో వర్తమాన కాలంలో వ్యవసాయదారుని పరిస్థితి యేలావుంది? లక్షాధికారి మొదలు భిక్షాధికారివరకూ యావత్ప్రపంచమూ అతని అనుగ్రహంమీద ఆధారపడవలసియున్నా సంఘంలో అతనికి గౌరవం, యెంతవరకుంది. అతని మర్యాదా పలుకుబడీ జనసామాన్యం మీద యేవిధంగా ప్రసరిస్తున్నాయి? అతడు అన్నవస్త్రాలకు లోటులేకుండా ఆలుబిడ్డలను పోషించుకోగలుగుచున్నాడా?

అనే ప్రశ్నలకు సమాధాన మాలోచిస్తే మన దేశంలోమాత్రం కేవలం వ్యవసాయదారుని స్థితి శోచనీయంగానే వుంది. రైతు, గౌరవాన్నీ మర్యాదను, సంపాదిస్తున్నాడంటే యితర కారణాలవల్ల కలుగుతోందిగాని వ్యవసాయంవల్ల కలగడంలేదు. ఆ కృషీవల సత్తముడు స్వకాయకష్టం చేత పండించిన ధాన్యాదులను యితరులు అనుభవిస్తూ, అతనిని పాతాళలోకానికి పతనం చేయూ

లని యతనం చేయడం క్షమింపరాని సాహసం. ఈ జులుమూ పొగరుబోతుతనమూ నశిస్తేనేగాని రైతు లోకానికి మోక్షం గగన కుసుమప్రాయం.

మన దేశంలో ఆదిమవాసుల నాటినుంచీ వ్యవసాయం ముఖ్యజీవనాధారం. ఈ పరిశ్రమలూ ఈ యంత్ర సాధనాలూ, ఈ వ్యవసాయ పరికరాలూ యేర్పడకపూర్వం రాతిబండ్లను తన బుద్ధిబలంచేత పనిముట్లుగ తయారుచేసికొని వ్యవసాయానికి ఆరంభించాడు పురాతన కర్షకుఁడు. ఇతర వృత్తులలోవున్న అస్వతంత్రత, బానిసత్వమూ కృషిలో గోచరించక పోవడంచేత స్వేచ్ఛాయుతమైన యీ వృత్తినే పూర్వకాలంలో ఆదరించడంలో ఆశ్చర్యమేముంది? కాని, ఆనాటి రైతునకూ నేటి అస్వతంత్ర భారతదేశంలోవున్న రైతునకూ వ్యత్యాసం మాత్రంవుంది. నాడు భూమిమీద సర్వ హక్కులూ కృషీవలునివే. పండించుకొని ఆరగించడం తనకు మిగిలినది ఇతరులకు పంచిపెట్టడం నాటిపద్ధతి. రాజునకు పన్ను కట్టవలసిన అవసరమే లేదు. భూస్వామికి, శిస్తు చెల్లించవలసిన బాధ్యత లేదు. తనకాయకష్టంవల్లయెంతభూమి సేద్యం చేయడానికి అవకాశ ముంటుందో దానిని కృషి

చేయడం దారాపుత్రులతో సుఖమయ జీవనం నెరపడం ఆతని ధర్మం. కాని వర్ణవ్యవస్థ యేర్పడి వృత్తి విభజన జరిగినపిమ్మట యితరుల నందరినీ తన నాగటికర్రుతో పోషించవలసినబాధ్యత రైతు రాజు శిరమున బడినది. నాటినుండి విసువుకొనక వేగిరించక, తన యుత్తమధర్మ నిర్వాహణమునందు కృతకృత్యు డగుచున్నాడు కర్షకుఁడు. ఆతని యాధారమున సమస్త జీవలోకము స్వధర్మము నిర్వహించు చున్నది. నిజముగా కృషీవలుఁడే కృషి చేయనినాఁడు మానవలోకమునకు భుక్తియెచ్చటిది? వృత్తి విభజన యేర్పడిన పిమ్మట సేవ్యము చేసి ఆహార పదార్థాలను పండించవలసిన బాధ్యత కలిగిన తరువాత భూమిమీఁద సమస్త హక్కులూ రైతునకే యుండెడివి. పండించిన ధాన్యములో తన కుటుంబ నిర్వాహణమునకు పోగా మిఁగిలినవి మాత్రమే యితరుల కర్పింపవలయును గాని నేటి వలె పండినను, ఎండినను, తాను పస్తుండియైనను మగతా చెల్లించ వలసిన కఠిన నియమ మానాఁడు లేదు. అనంతరము భారత రాజుల కాలములోఁగూడ పండినపుడు మాత్రమే పండిన భాగములో నారవవంతు ధాన్యమునుగాని ధనమును

గాని, చెల్లింపవలసిన యవసరమున్నది. ఐనను ప్రజలనుండి వసూలుకాఁబడినపన్నును రాజులు వారల ప్రజల సౌకర్యముల కొరకే వినియోగించు నాచారము కలదని రఘువంశమందలి యీ శ్లోకము వలనఁదెలియుచున్నది,

శ్లో॥ ప్రజానామేవ భూత్యర్థం సతాభ్యో బలిమగ్రహీత్ । సహస్ర గుణము త్సృష్టమాద త్తేహి రసంరవిః.

దిలీపుడు ప్రజల యైశ్వర్యముకొఱకే- వారి ఉపయోగము కొఱకే-వారలవలన పన్నును-గ్రహించెడివాడు-అయినను-రైతులనుండి గ్రహించిన ధనమును స్వోపయోగమునకు వినియోగించువాడు కాదు. తన ధనాగారమున నిలువ చేసెడి వాడు కాదు. ఈ శ్లోకమును పరికిలించినచో ప్రాచీన కాలమున పూర్వ కాలము రాజుల యొక్క పన్నును గ్రహించు నాచారము తెలియుచున్నది. కదా? పండినను, ఎండినను, నెరలు తీసినను, మునిగినను, బలవంతముగా, చరస్థిని జప్తు చేయించి పన్నును గ్రహించు నేటి విధానమునకును పండినపుడు మాత్రమే తన యుపయోగముల కొరకు

రాజులకుపన్నునిచ్చునాటి యాచారమునకును హస్తి మశకాంతరము కలదుగదా.

సాంఘిక జీవితమునందుఁగూడ నాఁడు రైతునకూ సామ్రాజ్యమును శాసించు సార్వభౌమునకూ దేశముకొరకై పోరాడువీరోత్తములకూ గౌరవము నందు భేదము కనరాదు. సంఘ శ్రేయమునకై తపోహోమాదులొనరించు బ్రాహ్మణులును, భుజబలమునభూమిని శాసించు క్షత్రియులునూ, లౌకిక వృత్తులచే జీవించు నితరులును, భూమిని దున్ని పండించు రైతును ఒకే విధములయినవారు. అంతియగాని నేటివలె వ్యవసాయదారుఁడన్న అలస భావము, చులకన, కలికమునకైనా కానరాదు. పల్లెటూళ్ళయందలి, రైతువృద్ధులను దర్శించినచో వారికున్న ప్రపంచ జ్ఞానము, నీతి, పాండిత్యము, భాషాభిరుచి నేను గర్వించుచున్న కొందరు B. A. లకు కూడ నుండదనుట యతిశయోక్తికాదు.

ఉపాధ్యాయుఁడు తన విద్యార్థులకు విద్యాబోధ చేస్తున్నాఁడు. అతఁడు రైతు కృషిమీద ఆధారపడి యున్నాడు. రైతు ధాన్యాన్నిపండించి యీయకపోతే ఉపాధ్యాయుఁడునూ లేడు. విద్యా

ర్థికయొక్క విద్యాభ్యాసమూ లేదు. అయితే ఆ విద్యార్జనలో రైతుకు మాత్రం భాగం లేదు. అతడు నాగలితో బురదలో పాతుకు పోవలసినదే! అతండికి విద్యరావడానికి మార్గాన్నిగాని, చైతన్యం కలగడానికి అవకాశాన్నిగాని, ప్రభుత్వం కలగజేయక పోవడం విచారించవలసిన విషయం. న్యాయసభలలో ధర్మశాస్త్రోపన్యాసాలను చేస్తూ సమాజాన్ని విమర్శించే లాయర్లందరూ వ్యవసాయ దారుని వ్యవసాయంమీద ఆధార పడవలసిన వారే. అయితే ఆ రైతు లాయరును చూడబోతే తనఫీజు రాబట్టుకోవడానికే యత్నిస్తాడు గాని అతని అమాయికత్వాన్ని గుర్తించి సహాయం చేయడానికి ప్రయత్నం చేయడు. పైగా అతనిని పరిహసించడానికి మార్గాన్ని అన్వేషిస్తాడు. తానెవరిమీద ఆధారపడి యున్నాడో తాను కబుర్లు చెపుతూ భోజనం ఆరగించడానికి యేమహానుభావుడు కారకుడో వూహించడం లేదు. సమాజంలో యీ అసభావం నశిస్తేనగాని రైతునకు భావికాలంలో ఔన్నత్యం లేదు.

సీ॥ నీవు పండించిన నెగడెడి లాయరు
పల్లెటి జనమంచు పరిహసించు

నీవు పండించిన నెగడెడి డాక్టరు
　　మోటువాడంచును మూతివిరుచు
నీవు పండించిన నెగడెడి విద్యార్థి
　　చదువురాదంచును సరసమాడు
నీవు పండించిన నెగడెడి వణిజుండు
　　బీదవాడంచును చీదరించు

తే॥ గీ॥ నీవు పండింప ధనమును నింపుకొనుచు
ప్రభువులందరు నెగతాళి పలుకుచుంద్రు
నీదు ఋణమును దీర్పంగ నేరలేరము
సరసగుణవర్తి కర్షకచక్రవర్తి.

పట్నవాసాల్లో నాగరికులమని భావిస్తూ వ్యాపారాదుల చేత జీవయాత్రను సాగిస్తున్న వారంతా రైతుకృపా కటాక్ష ప్రసారానికి యెదురు చూడవలసిన వారేగదా! వేషభాషలతో విర్రవీగుతూ విలాసాలతో కులుకుతూ సంఘంలో మసలుతూ వున్నవారంతా యీ రైతు బిడ్డ కష్టాన్ని గుర్తించి అతనికి అంజలి అర్పించవలసిన అవసరముంది. నిఖిల ప్రాణిలోకానికి అన్నదాతయైన కర్షకుని గమనించి యితర కార్యకలాపాన్ని చూసికోవలసిన అవసరముంది.

సాంఘికంగా, ఆర్థికంగా రాజకీయంగా సర్వవిధాలా తమను నాశనం చేస్తూ పీల్చి పిప్పి జేస్తున్న వర్గంవారి కొరకుగూడా స్వార్థ రహితులై నిరంతరం కృషిచేస్తున్న అశేష కర్షీవల సంతతీ అభినందనీయమైనది. తమ అనన్యకృషిలో, స్వార్థ త్యాగంలో అనేకమైన రాజకీయ వేత్తలనూ దేశ భక్తులనూ తయారు చేస్తూవున్న వారిని అభినందించని జాతియే వుండదు. యావత్ప్రపంచములో వున్న మానవసముదాయమూ, జీవించడానికీ కదలడానికీ ఆలోచించడానికీ యేవస్తువుల ఉపయోగం అవసరమో, ఆవస్తువులయిన కేవలం ఆహార పదార్థములనేగాకుండా యితరమయిన ముడిపదార్థాలను కూడా ఉత్పత్తిజేసి ప్రజల జీవితాన్ని సౌఖ్యప్రదంగాజేయడానికి రైతులు చేస్తూవున్న కృషి అనన్యసాధ్యమైనది. ప్రపంచంలో భారతదేశం ఈమాత్రమయినా తలయెత్తుకొని, అన్నోదకాలకు కొరత లేకుండా జన సామాన్యంలో ఏకొద్దిమందిఅయినా వుండడానికి కర్షకుల అపారకృషియే ప్రధాన కారణం. యుద్ధ కార్యాలయాలయందు ఆసుపత్రులయందు, అధికారాలయందుపనిచేస్తున్నవారి కందరికి అధికమయిన ఆహారాన్నిఉత్పత్తిచేసి అందిస్తున్న రైతులు భారతదేశ భద్రతను స్థిరపరచడానికి

ప్రధాన కారకులయ్యారనడంలో అర్థవాద మేమీ లేదు.

దయాదాక్షిణ్య శూన్యహృదయులై, మానవత్వంకూడా మన్నచేసి తమ పాదాలక్రింద నలగకొడుతున్న ప్రజల సౌఖ్యానికి, ప్రభుత్వ వ్యవహార సౌకర్యానికి ధనికవాదుల సంతోషానికీ కృషీవలుడు తన స్వేదబిందువులను అర్పిస్తున్నాడు. నిజంగా వ్యవసాయదారుడు తనకు సర్వతో ముఖమయిన అభివృద్ధి కలిగే టంతవరకూ రాజకీయార్థిక స్వాతంత్ర్యం చేకూ రేటంతవరకూ సహాయనిరాకరణాన్ని సాధనంగా ఉపయోగించినట్లయితే జీవితానికి అవసరమయిన, ప్రాణధారణకు ముఖ్యమయిన, బియ్యం, గోధుమలు, కూరగాయలు, పాలు మొదలయిన వాటిని తయారు చేయకుండా వున్నట్లయితే ఈధనికవర్గాలవారు అధమం ఒకరాజకీయవేత్తనుగానీ, ఆర్థిక వేత్తనుగానీ, ఆర్థికశాస్త్రవేత్తనుగానీ, ఒక ప్రజాసేవకునిగానీ, సృష్టి చేయలేరంటే తప్పుగాదు.

దేవుళ్లనూ, దయ్యాలనూ, మతాచార్యులనూ మాష్టర్లనూ, ప్రపీడకులనూ, బిచ్చగాండ్రనూ చి.రకు చనిపోయినవారినికూడా సంవత్సరం

పొడుగునా సంతృప్తి పరచడానికి రైతులు కృషి చేస్తున్నారు. కాని ఆ రైతును గురించి ఒక క్షణ ముయినా ఆలోచించే దాత కనిపించక పోవడం ఆశ్చర్య కరమయిన విషయం. కాక అతనిస్థితిగతు లను ఆలోచించినా అతనికి రాజకీయార్థిక సౌకర్యా లను కలిగించడానికి ఇతరవర్గాలవారు కృషి చేస్తూ వుంటే కర్షకవర్గంలో స్వార్థరహితులైనని ఋపేదలు కొందరు తిండి కొరకు మలమల మాడవలసిన అవసర మేముంది? ధనిక వర్గాలవారు, విలాసం కొరకూ వినోదం కొరకూ పెంచుకొంటూవున్న కుక్కలూ, పిల్లులూ, కూడా కడుపునిండా తిని, కాలదన్ని పార వేస్తాయి. ఆజంతువులకు ఉత్పత్తి చేసే పేదరైతు ఆ మాత్రం సానుభూతికయినా నోచుకోలేదా? భాగ్యవంతుల పెంపుడు జంతు వులు బంగారు కంచాలలో పంచభక్ష్య పరమా న్నాలతో విందులారగించి హంసతూలికా తల్పాల మీద శయనిస్తూ రైలులో మొదట తరగతి పెట్టి లో ప్రయాణచేస్తూవుంటే యావత్ప్రపంచమూ జీవించడానికి రక్తమోడ్చి కృషిచేస్తూవున్న కృషీ వలుడు మూడవ తరగతిలో నయినా ప్రయాణం చేసి గంజినీళ్ళయినా త్రాగలేక పోతున్నాడంటే

సమాజంలోవున్న యీ కారణానికి. నిరంకుశ విధానానికీ ఇంతకన్న వేరుఉదాహరణ మేమివ్వాలి.

రైతుల యీఘోరస్థితి మారాలంటే రైతులందరూ అన్నోదకాలతో సుఖపడాలంటే వారికి సర్వతోముఖాభివృద్ధి కావాలంటే ఈప్రభుత్వవిధానమూ మారాలి. ఈసాంఘికవ్యవస్థాకొంతసంస్కరింపబడాలి. ఈఆశయసిద్ధికోసం ప్రస్తుత ప్రపంచ వ్యవస్థమారి వినూత్న వ్యవస్థాసిద్ధికోసం ప్రజా సామాన్యం యొక్క హృదయాల్లో పరివర్తనం కావాలి. త్రికరణశుద్ధిగాయీమార్పువచ్చినట్లయితే కృషీవలుని భవిష్యత్తు అభివృద్ధికరమాతుందనడానికి సందేహంలేదు.

ప్రజా బాహుళ్యమంతా ఒకేమారు ముక్తకంఠంతో ఈసామాజిక జీవనం పట్లా యీప్రస్తుతవ్యవహారం పట్లా తమ అసమ్మతిని తెలియజేసి దాన్ని నిర్మూలం జేయడానికి కృతనిశ్చయులయితే తప్ప దేశానికి మోక్షం వుండదు. తద్వారా దేశంలో ఎక్కువ సంఖ్యగావున్న రైతులకుకూడా సత్వరాభివృద్ధి కలగడానికి అవకాశంవుండదు. రైతునకు తనస్థితి తాను తెలిసికోవడానికిగాను, తనభవిష్యత్తు బాగుపరచుకోడానికిగాను విజ్ఞానం

అవసరం. రాజకీయంగా కొలది మాత్రమైనా విజ్ఞానముంటే ఆర్థికంగా తమకు కలుగుచున్న ఇబ్బందులను గురించి ఆలోచించడానికి అవకాశముంది కనక ఆర్థికంగా రాజకీయంగా విజ్ఞానం కర్షకునకు ముఖ్యావసరం. తమ ఇబ్బందులను గూర్చి అధికారవర్గంతో చెప్పుకోగల శక్తి గాని, తమ హక్కులను గూర్చి సక్రమ విధానంలో పోరాడే రీతిగాని తెలియాలంటే వారి ఉద్యమాల్లో విజయం కలిగే పద్ధతులు అనుసరింపబడాలంటే వారికి సంపూర్ణమయిన విజ్ఞానం కలిగే సాధనము ఏర్పడాలి.

ఎండనక వానఅనక నిరంతరం కృషిచేస్తూ వున్న రైతు సోదరుడు తాను స్వయంగా విద్యనభ్యసించాలంటే సాధనాలు బహుస్వల్పం. పాఠశాలలోకి వెళ్లి చదువుకోవడానికి అవకాశముండదు అవకాశమున్నా పాఠశాలలో వున్న విద్య బాలురకే సరిపడదని నేటి విమర్శకు లూహిస్తుంటే ఇంక వయోజనులకా విద్య యేలా సరిపోతుంది. అయితే వయోజనుల కుచితమై, తమస్థితిని తాముగుర్తించ కలిగే రాజకీయార్థిక విజ్ఞానమును ప్రసాదించే పాఠశాలలు ప్రత్యేకం రైతులకు కావాలి. ఇంకా వ్యవసాయంలో అవలంబింపవలసిన పద్ధతులు ప్రజా

ఉద్యమాల్లో పాల్గొనవలసిన విధానం అతనికి తెలియాలి. అందుకని వయోజన విద్యాప్రచారం కొరకు రాత్రిపాఠశాలలు ప్రతిగ్రామమందూ నెలకొల్పబడాలి. రైతులంతా రాత్రిభాగాల్లో ఆవిద్యాభ్యాసంచేసితమవిజ్ఞానాన్ని పెంపొందించుకొని దేశంలోతమకున్న పాత్రను ప్రముఖంగా నిర్వహించుకోవాలి. గ్రంథాలయాలయందుకూడా రైతువికాసానికీ వ్యవసాయాభివృద్ధికీ అనువయిన గ్రంథాలను తీసికొని వచ్చి రైతులచే చదివించాలి. వారు చదవ లేకపోయినట్లయితే యితరులు చదివి వారికా విషయాన్ని విపులంగా తెలియజెప్పాలి. పత్రికాపఠనముకూడా రైతులకుముఖ్యావసరం. తరువాత వైజ్ఞానిక ప్రదర్శనాలద్వారా రైతులకు విజ్ఞానం కలగజేయడానికి అవసరముంది. బుర్రకథలమూలంగా కూడ వయోజనులకు విద్యాబోధచేయడం అవసరంమైనవిషయం. రాత్రిపాఠశాలలు వైజ్ఞానిక ప్రదర్శనాలు. గ్రంథాలయాలు, మొదలయిన సాధనాలవల్ల కృషీవలునకు వ్యవసాయానికి అనువయిన విజ్ఞానాన్ని ఇవ్వడానికి కృషిచేసి నట్లయితే అతని భవిష్యత్తు సుకరంగావుంటుంది. కర్షకుడు తనస్థితిగతులను తానుస్వయంగా తెలిసికొని దానికవసరమయిన మార్గాన్ని అన్వేషించుకొని కర్తవ్యం

నిర్ణయించుకొంటాడు. తన్నివారణకు సాధనాలను, పరిశీలించు కోడానికి తగిన విజ్ఞానవంతుడయి తేవాలు, దానివల్ల కేవలం రైతు లోకమే కాదు. యావద్భారతమూ సౌభాగ్యపరిధిలో నడుస్తుందని చెప్పవచ్చు. భారత దేశానికి మూలకందము కర్షకుడే కదా!

పేద రైతులకు కేవలం విజ్ఞాన దానంవల్ల ప్రయోజనం లేదు. వ్యవసాయానికి అవసరమయిన పరికరాలూ, పెట్టుబడి, ప్రశస్తమయిన విత్తనాలూ ప్రభుత్వం సహాయం చేయాలి. లేకపోతే తనకున్న స్వల్పభూమిలో ఇతర సహాయం లేకుండా కృషిచేసికొని లాభం పొందడం అతనిసాధ్యంగాదు, ఇతర దేశాల్లో రైతులకు అవసరమయిన పనిముట్లు-కావలసిన పెట్టుబడి-మేలురకమయిన విత్తనాలూ-ప్రభుత్వం సరఫరాచేస్తుంది ఆ సహాయం మూలంగా ఉత్సాహంతో కృషిసాగించి మంచి పంట పండిస్తాడు. అంతేగాక పనిముట్లలోకూడా యంత్రపరికరాలు ఉపయోగించడంవల్ల అతనికి పనిసులభమవుతుంది. పెట్టుబడీ తగ్గుతుంది. ఫలితానికి కొరతవుండదు. అందుచేత మన దేశంలోకూడగవర్నమెంటుసహాయంలేక పోతే వ్యవసాయం అభివృద్ధి

చెందదు. రైతునకు ఉత్సాహమూ శూన్యమవుతుంది. కనుక కనీసం పేదరైతులకయినా ప్రభుత్వ వ్యవసాయపరికరాలూ పెట్టుబడీ సొమ్మూ సహాయంచేసి నట్లయితే భారతదేశంలో వ్యవసాయం బాగా అభివృద్ధి చెందుతుంది. ఇంకా మన ఆంధ్ర దేశంలో కృషిలోకి రావలసిన, నిరుపయోగమైన భూమి చాలావుంది. దీనికి గవర్నమెంటు పూనుకొని కొంతసహాయంచేస్తే రైతులూ సంతోషిస్తారు. భూమికూడా సేద్యంలోకి వస్తుంది. దానిమూలంగా అధికారారోత్పత్తి ఇతోధికంగా జరుగుతుందని చెప్పడం చర్విత చర్వణం. పల్లెటూరిలో నివసిస్తున్న రైతు స్థితి వర్తమాన కాలంలో చాలాశోచనీయంగావుంది. నాలుగెకరాల వ్యవసాయంవున్న ఆసామీకి పెట్టుబడి, కూలీలు పోను మిగిలే ఆదాయం చాలా తక్కువ. ఆతక్కువ ఆదాయంలోనూ పన్నులు కట్టుకొని రైతు తన జీవితాన్ని సుఖవంతంగా గడుపుకోవడమే చాలా కష్టమయినవని. అట్లాంటి సమయంలో తన తక్కువ భాగంలో చందాలు యిచ్చి యాచకులకు సంభావనలిచ్చి కరణాలకు మామూలుఇచ్చి యితగులకుకూడ కొద్దో గొప్పో ముట్టజెప్పి కృషీవలుఁడు తన కుటుంబ భారాన్ని యేవిధంగా వహి

స్తాడు? రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసినా అతనికి భుక్తిలేదు. సమస్త ధాన్యాలూ పండించి ఇచ్చినా అతని దారాపుత్రులకు మాత్రము గంజినీ లేగతి. కాయకూరలను ఫలములనూ తాను పండించినా రుచిచూచే హక్కు మాత్రం లేదు. నడుమును బిగించి నాగలిపట్టి దున్నినా కడుపునిండా అన్నం మాత్రం శూన్యం.

సీ॥ పవలును రాత్రియు బహుబాధలందినన్
తినుటకు తిండియే కనగరాదు
సర్వధాన్యంబులు సాధించి యిచ్చినన్
ఆలు బిడ్డలకైన చాలబోవు
దినమెల్ల కష్టించి దినుసులు పండింప
చవిచూచు భాగ్యమే ఛాయలేదు
నడుమును బిగియించి నాగలిబట్టినన్
గంజినీళ్ళకు కూడ గతియు లేదు

తే॥ గీ॥ స్వీయకష్టంబు పరులకు చెందజేసి
నిత్యసంతోష వృత్తితో నెగడు రైతు
కటకటా యెంతదారుణ కార్యమరయ
రైతు సుఖియించు రోజులు రాకయున్నె.

రైతు తన సంవత్సర గ్రాసాన్ని వివిధంగా

యేర్పాటు చేసికొన్నట్లే అతడు చెల్లించ వలసిన ముడుపును కూడ రకరకాలుగా చెల్లించవలసివుంది. గవర్నమెంటు పన్నుకయినా మామూలు వాయిదాలున్నాయిగాని, యీ జులుముతో గూడిన పన్నుకు మాత్రం అడగిననాడే వాయిదా. అతని చేతిలో వున్నదా లేదా అనేఆలోచన అక్కర లేదు. ఇంత యీతడు యివ్వగలడా, యివ్వలేడా అనే మీమాంస లాభంలేదు. ఈతనికి మనంచేసిన ఉపకారం యెంత? ఆఉపకారాన్ని మనఉద్యోగధర్మంగా నిర్వహించామా? ఉపకార బుద్ధితో చేశామా అనే దయార్ద్ర బుద్ధిశూన్యం. నిజంగా ఆలోచిస్తే వీళ్లకి మామూళ్లు ఇవ్వవలసిన అవసరమే లేదు. ఉద్యోగధర్మంలో వీరు రైతుల కుపకారం చేస్తూవుంటే గవర్నమెంటువల్లజీతాన్ని తీసికొంటున్నారు గదా? ఉపకార బుద్ధితో ఉత్తమధర్మాన్ని నిర్వహిస్తూవుంటే ప్రత్యుపకారాన్ని అపేక్షించి చేసిన ఉపకారం యేమంత హృదయ పూర్వకమైనది? ఎంత నిరుపాధికమైనది? కనుక ఆవిధంగా నయినా వారేమీ గ్రహించకుండా రైతులోకానికి ఉపకారం చేస్తూవుంటే ఆ వుద్యోగస్థులకు రైతులోకమంతా శాశ్వతంగా ఋణపడి వుండేది. వారిని యెంతో వుత్సాహంతో వినయంతో గౌరవిం

చేది. కాని విద్యాధికులయిన వారు లంచాలకాశించి గౌరవాన్ని డబ్బు కమ్ముకోవడం గర్హింపవలసిన విషయం. ఏతావతా చెప్పదలచుకున్న విషయమేమంటే యీ విధంగా ఐచ్ఛికంగానూ, నిర్బంధంగాను మొహమాటంగానూ చెల్లించుకోవలసిన ముడుపులవల్ల వర్తమాన కర్షకునిస్థితి యెల్లావుందో గమనించండి.

సీ॥ మామూలు చెల్లించుమాయంచు కరణంబు
వేధించు నిరతంబు వేగిరించు
చూడవే! మావంక చూడమునీపస
అని యినస్పెక్టరు ఆగ్రహించు
ఈయేడు మాకేమి ఈయగాలేదంచు
ఇంజనీయరు గారు ఈసడించు
మనడబ్బు పారెయ్యి మాటలో నీరిస్త
అని లాకుమేస్త్రిరి అలమటించు

తే॥ గీ॥ ముడుపు చెల్లించకుండ నాముఖముచూడ
రాదు నీకంచు కళాసువాడు జేయు
కటకటా యిన్నిపన్నులు కలసియుంట
రాణచెడిపోయె మారైతురాజునేడు.

ఇన్ని విధాలయిన అవాంతరాలు యేర్పడి

ఇందరిచేత నిర్బంధింపబడి యీ స్వార్థపరుల పొట్ట లను తన కష్టార్జిత విత్తంచేత నింపించి నేటి పేద రైతు నానాకడగండ్లకూ లోనవుతున్నాడు.

యీ నిర్బంధ విధానమూ, గవర్నమెంటు అధికారుల ఒత్తిడీ తగ్గితేనేగాని భావికాలంలో వ్యవసాయదారుని పరిస్థితి చక్కబడదు. దీనికి మించినది లంచగొండి తనము. యీ లంచాల పేరుతో పేదరైతుల రక్త మాంసాన్ని హరించి వారిని, నిర్జీవంగానూ జీవచ్ఛవ ప్రాయంగానూ పీడి స్తున్న అధికార వర్గాన్ని తీవ్రంగా రైతులోకం యావత్తూ సంఘీభావంతో, ఏక కంఠంతో నిర సించవలసిన అవసరముంది. ఉద్యోగస్తులకు లం చాలయందు వాంఛ కలగడానికి స్వార్థ పరులగు కొందరు సంపన్న రైతులు నేర్పినపాఠమేనని మనం గ్రహించవచ్చు. సంపన్నులయిన వారు తమఅవ సరంకొద్దీ, తమభూమి ముందుగా సేద్యం కావా ల అదుర్దాకొద్దీ నేర్పారు అది పేద రైతులను పీల్చి పిప్పిచేస్తోంది.

కాల్వలు త్రవ్వించడం, ఆనకట్టలు కట్టడం వగయిరా పనులు ప్రభుత్వం వ్యవసాయ దారుల క్షేమంకొరకు ఏర్పాటు చేసినవేకదా! ఆ నీటిని

సకాలంలో సవ్యంగా రైతులకు సరఫరాచేయ డానికేకదా గవర్నమెంటు వారికి జీతాలిచ్చుట? అల్లాంటి సందర్భంలో జీతాలు పుచ్చుకొంటూ మరల రైతులదగ్గరనుంచి లంచాలుగుంజు కోవ డంలోవారి ఉద్దేశ్యమేమిటి? ఈపద్ధతిని పూర్తిగా రూపుమాపాలంటే వ్యవసాయదారులందరిలోనూ సంఘీభావం అత్యవసరం. సక్రమమయిన ఆందోళన చేసివారికి కావలసిన హక్కులను స్వీకరించటంలో ఐకమత్యం. సంఘీభావం కార్యకారి అయినట్టు ఈ కాలంలో మరొకవిధానం లాభకరంకాదు.

పేదరైతు తన జీవనోపాధికోసం యితరుల వద్ద భూమిని సేద్యంచేయడానికి కౌలుకు తీసికొంటు న్నాడు. దీనివల్ల ఆపేదరైతుకు లాభం కలగడం లేదు. అదిపండితే సక్రమంగా అనుకొన్నంతగా మగతా యివ్వడానికి అభ్యంతరంలేదు. పండక పోయినా పట్టుకొచ్చి యియ్యాలంటే కష్టంకాదూ? కష్టమయినా సాధ్యంకావద్దూ! ఇవన్నీ యిచ్చి తా ననుభవించేది చాలా స్వల్పంగాఫుంటుంది.

సీ॥ పండినాయెండినా పనిలేదు నాకంచు
మగతాను గొనిపోపు మాన్యదాత

పనితోడ నాకేమి భత్యంబు లిమ్మంచు
గోలను చేయును కూలివాడు
పన్నునాకేల యీ పంటలో సగపాలు
భాగించి యిమ్మను పాలికాపు
నీతోడ మాకేమి నీయాస్తి జప్తుచే
యింతునంచు వచించు యిరుగుదారు

తే॥ గీ॥ కష్టసంతతి గట్టెక్క కడుపునిండ
కూడు తినుటను నోచుకోకూడదయ్య
ఇంత దౌర్భాగ్యపరుడవై మెసగునిన్ను
జాలిగా జూచువారలు జగతి లేరు.

ఇంతటియాతనాపరంపరలననుభవిస్తూవున్న నూ, లోకం పేదరైతువైపు దయార్ద్రమైన చూపు కూడా చూడడం లేదు నాలుగెకరాల భూమికీ నలభై బస్తాలు నాకియ్యి ఎక్కువపండిననాడు నాకెక్కువయిస్తావా? తక్కువపండినాసరే, నీ భార్య తాళి అయినా తాకట్టుపెట్టి నామగతా నాకియ్యి అని వేగిరిస్తాడు భూమిని కౌలుకిచ్చిన ఆసామీ. మాచేత పనిచేయించుకున్నా చేయించుకోక పోయినా మాకూలి మాకిచ్చెయ్యమని కూలివాడు తీసుకుపోతాడు. ఈవిధంగా అతనివల్ల బ్రతుకుతున్న జనమే అతనిని అన్ని విధాలా అణగదొక్కి

డబ్బుగుంజుకోవడానికి చూస్తున్నారు. ఎవ్వరూ పొలం సేద్యంచేయకపోతే పట్నంలో ఉద్యోగం లోవున్న వానియొక్క వ్యవసాయాన్ని సేద్యం చేయడానికి మార్గమేది? మన భూమి పండకపోతే అతను మాత్రం యెక్కడినుంచి తీసుకువస్తాడు? అనే విశాలబుద్ధి శూన్యులయినవారు ప్రబలమవడం వల్ల కర్షకునకు నష్టంవస్తోంది.

రైతు ఈవిధంగా సంవత్సరం పొడుగునా కష్టించి పనిచేసి పండించిన ఫలితాన్ని ఇతరుల కర్పించి యాతడు బరువువదలినవాని రీతిగా ఉపవాసాలతోనే, ఆకటిచిచ్చులోనే కాలక్షేపం చేస్తున్నాడు. అసంఖ్యాక పేదజనం అన్న మోరామచంద్రాయని అల్లాడుతూ వున్నారు. పెద్దలుతమ దర్జాకోసన్ని భాగ్యవంతులకే డిన్నర్ పార్టీలు చేస్తారు. కాని నిరుపేదలను కంటితో నయినా చూడరు. తమయింటి ప్రక్క దారిద్ర్యంలో కుమిలిపోతూవున్న కుటుంబాన్ని చూసి సానుభూతి కూడా చూపక ఇతిరులకు టీపార్టీలిస్తున్న వీరు తల్లిని చావగొట్టి యితరులకు సమారాధనలు చేసే ప్రముఖులకు అన్నలవుతారా? ఒట్టుకట్టకూడా లేక అర్ధనగ్న శరీరంతో రైతులోకాన్ని చూడడానికి

బాధపడుతూ, అవమానభారంచేత శరీరాన్ని కుం చించు కొంటూ దయనీయమైన అవస్థలో వుం డగా యింకావిదేశాల బట్టలనే ఆదరిస్తూవున్న ఆంగ్లమాన[redacted] పుత్రులనేవిధంగా సంఘంగౌరవించాలో తెలియదు. నిజంగా వారి విదేశభక్తికి యావద్భారతి దేశము అంజలి నర్పించవలసిందే!

సీ॥ ఆకటిబాధతో నతను విచారింప
నితరులకానంద మెట్లు కలుగు
కట్టబట్టయు లేక కలవరించుచు నుండ
పరులకు బట్టలేపగది వచ్చు
చేత కాసును లేక చింతతో నతనుండ
బంగారు తొడవులే పాపిదాల్చు
నివసింపదేహంబు నీడ లేకతడుండ
మేడమిద్దెలలోన మెలగు టెట్లు.

తే॥ గీ॥ భారతీయాది కర్షక భాగ్యశాలి
వెతలపడుచుండ మనసులో పిన్నజేసి
గారవించియు కన్నీటకనికరింప
వేల భారతీయ కఠిన మేలనీకు.

ఈవిధంగా పేద రైతుతోడి వారల వల్లనే వెతల ననుభవించు చుండగా సానుభూతిని చూప

డానికయినా జంకుతున్న యీసమాజాన్ని యే విధంగా నిరసించాలో తెలియడంలేదు. నిజంగా యిప్పుడున్న సాంఘిక వ్యవస్థవల్లనే కొందరుపీడింప బడుతున్నారు. ఈసాంఘిక వ్యవస్థ కొంతమారినా లేకపోతే పునరుద్ధరింప బడినా సమాజంలో నలిగ కొట్టుకుతూవున్న జాతులన్నీ ఒకేమారు నూతన చైతన్యంలో స్వేచ్ఛావాయువను పీల్చుకోడానికి అవకాశ ముంటుంది. అందులో ధనికవర్గంచేత సర్వవిధాలా అధఃపతనం చేయ బడుతూవున్న అమాయిక పేద రైతుజాతి, గవర్నమెంటుచేత పీడింపబడుతూవున్న రైతుజాతి, ఇప్పటికంటె ఉన్నతమయిన స్థానంలోకి వెళ్లుతూ మంచిగౌరవాన్ని సంపాదించడానికి అవకాశముంది. సమాజంలో గౌరవాన్నీ ప్రతిష్టనూ, పలుకుబడినీ, అపేక్షించి దగ్గరవున్న నిరుపేదను సంరక్షించకుండా దూరాన వున్నవారికి సహాయం చేసినట్లు ఆడంబరం చూపడం నేటి నాగరికత లక్షణం ఈ డంబాచారాలుదురన్యాయాలు పూర్తిగానశించిపోవాలి.

రైతుఉత్తమ మయిన కృషిచేసి భూదేవి నుండి మంచిపంటను సంపాదించి ప్రజలకు అందివ్వాలి, అతనికి ఏవిధమయిన లోటూ రాకుండ

అతడు తనదారాపుత్రులతో సుఖంగా జీవనసాగిం చడానికి వలసిన గ్రాసాన్ని ప్రభుత్వం అందజే యాలి. విలాసాలూ, భోగలు, ఇతరులతో పాటు అతనికి లభించినా లభించక పోయినా, కనీసం భుక్తికీ బట్టకూ లోటు జరుగకుండా పోషించడం గవర్నమెంటు తన కనీసం ధర్మంగా భావిస్తే కర్షకలోకం ఇంకా ఉత్సాహం వంతంగా ఉత్ప త్తిని సాగించి లోకానికందజేస్తుంది. ఇందులో ముఖ్యంగా వ్యవసాయమునకు పెట్టిబడి వ్యవ సాయ పరికరాలూ విత్తనాలూ, ఈవిధంగాసప్లయి చేస్తే రైతుకు ఆనందంగా వుంటుంది పంట అద నంగా అందుతుంది. మంచిధాన్యం లభ్యమవు తుంది ఇతర దేశాలలో రైతు కు పెట్టుబడి కొర కని ఋణంగా ప్రభుత్వం ఇచ్చే ఆచారంవుంది. మనదేశంలోకూడా కొంతధనాన్ని ప్రత్యేకించి వుంచుతున్నారుగాని అది సక్రమమయిన పద్ధతిలో పంపిణీ జరగకపోవడం విచారకరమయిన విషయం పలుకుబడీ,నోరూ కలవారెవరో తమస్వార్థంకోసం ఆ ధనాన్నిఉపయోగించు కొంటున్నారు. ఈవిధా నాన్నిగర్హించి రైతులోకం కృషి చేసి యే పేద రైతుకు పెట్టుబడి అవసరమో అతనికే ఆధనంఅందే యేర్పాటు చెయ్యాలి.వ్యవసాయ పరికారాల వల్ల

కూడా చాలా లాభముంది సక్రమముగాను వేగం గాను, సకాలంలోనూ కృషి జరగాలంటే మంచి పనికరా లవసరం. ఇక విత్తనాలనుగూర్చి ఆలో చించవలసివుంది. అసలు మంచి జాతిధాన్యం తయారు కావాలంటే విత్తనాలు ముఖ్యం గదా? బీజం ఉత్తమమైన దయితే పంటకూడా మంచిది తయారవుతుంది. అధికంగానూ ఉత్పత్తి అవు తుంది. ప్రశస్తంగానూ వుంటుంది. అయితే ఈ విత్తనాలనుగూడ మనరైతులే జాగ్రత్తచేసివుంచే వారు. ఇటీవల వ్యవసాయ పరిశోధక సంఘము వారు ఏ నేలయందు ఏపంట పండించవచ్చునో, దానికాదాయమెంతవచ్చునో, ఖర్చు ఎంతఅగునో మొదలగు విషయములను స్వయముగా పరిశీలించి తెలియజేసియున్నారు. ఆ సంఘము వారే మంచి విత్తనములను నిలవజేసి రైతుల కమ్ముచున్నారు. కాని వీరు అమ్ముచున్న ధరలు సక్రమంగా లేవు. నప్పుచేయుచున్న విధానముకూడ సమంజసంగా లేదు. రైతులువద్ద కంట్రోలు రేటు ప్రకారం ధాన్యంకొనుచున్నారు. రైతు మాత్రము, ఈ విత్తనాలకొరకు కొనవలసిన ధాన్యము కంట్రోలు రేటును మించిపోవుచున్నది. ప్రభుత్వమువారే యీ విధంగా కంట్రోలు రేటుమించి అమ్ముతూ

వుండడం చాలఘోరమయినవిషయం. న్యాయపరి పాలకులూ ధర్మసంస్థాపకులూ అయిన ప్రభుత్వ కార్యాలయంవారే ఘోరంగా అమ్మబోపడం రైతులకు చాలనష్టం. “కంచెయే చేను మేసినకలదె దిక్కు”

వ్యవసాయంలో నూతన విధానం అవలం బించడం చాల ముఖ్యమయిన విషయం. ఏభూమి లో పంట పండడానికి ఎక్కువ అవకాశ ముం టుందో, ఆపంటనే పండించడానికి యెక్కువ అవ కాశముంటుందో, ఆపంటనే పండించడానికి కృషి చేయాలి. మన ఆంధ్ర దేశంలో మాత్రం రైతులు నూతనమయిన పంటను పండించడానికి యత్నం కూడా చేయకపోవడం చాల శోచనీయ మయిన విషయం. ఒకడు వరి పండిస్తున్నాడంటే అందరూ దాన్నే అవలంబించడం. ఒకరు చెరుకు పండిస్తూ వుంటే అందరూ చెరకు తోటలనే వేయడంగాని మరొక కొత్తపంటను పండించి ఆదాయాన్ని అభి వృద్ధిచేసికోవాలన్న అభిలాషకూడా శూన్యంగా కనిపిస్తోంది. విదేశాల్లో యీ పద్ధతిగాదు. భూమి యొక్క సారాన్ని గుర్తించి రకరకము లయిన పంటలను పండించి ఆదాయాన్ని రెండు మూడు

3713 630.174

విధాలుగా పెంపొందించుకోవడానికి కృషిచేస్తారు. ఒకేభూమిలో మూడేసి మాసాలకొక పంటవంతున పండించి సంవత్సరానికి రకరకాలయిన పంటలను మారుస్తూ ధనాన్ని సంపాదించడం వాళ్ళకి చేతయినట్టు మనదేశంలో అలవాటు కాలేదు. ఈ విధంగా ప్రతీ సంవత్సరమూ పంటలను మార్చాలన్నా, ఒకే భూమిలో, సంవత్సరానికి రెండు మూడు పంటలు పండించాలన్నా భూమికి మంచి యెరువులను పోసి సారవంతముగా తయారుచేయాలి. పిమ్మట దాని కుచితమయిన విధంగా ఆ భూమియొక్క స్వభావాన్ని దానికి నీటిపారుదల సౌకర్యాన్ని పురస్కరించుకొని అధికమయిన పంటలను పండిస్తే ఆదాయమూ వృద్ధి అవుతుంది, యుద్ధకాలంలో అదనపుపంటలూ పండుతాయి. అయితే ఈమార్గం అవలంబించడానికి ఈ ఆదాయాన్ని అభివృద్ధిపరచుకోవడానికి రైతుకు కొంతవిజ్ఞానము కావాలి. ప్రపంచజ్ఞానముకావాలి. ఇతరదేశాలలో వ్యవసాయదారుల నవలంబిస్తూ వున్న పద్ధతులుకూడ నేర్చుకొనివుండాలి. ఆవిధంగా కృషిచేసినట్లయితే భారతదేశ కృషీవలుడు సహితమూ అధికమయిన ఆదాయాన్ని సంపాదించుకోకలుగుతాడు.

జి. గ్రం. సం.
శాఖా గ్రంథాలయము
కూచిపూడి

ప్రస్తుతం యుద్ధకాలంలో కరువు యేర్పడి దేశం నాశనం కాకుండా వుండడానికి, ఆహారపదార్ధాలు అన్నిప్రాంతాలలోనికి సక్రమంగా సరఫరా కావడానికీ, పండని ప్రదేశాలలో కూడా కొఱత యేర్పడక అందరికీ అందుబాటులో వుండడానికీ అవసరమయిన ఆహారపదార్ధాల ధర విపరీతంగా పెరగకుండా వుండడానికీ ధాన్యం ధరలను కంట్రోలుచెయ్యడం రేషనింగు అమలులోపెట్టడం అవసరమయినవే అవి ప్రజాసౌకర్యానికి ఉపయోగించేవే. కాని దాని ఆదర్శం మంచిదయినా ఆచరణలోనే మాత్రం అవకతవకజరిగినా రైతులోకానికి తీరని నష్టం వస్తుంది. ఆవిధంగా కలుగుచున్న నష్టాల్లో ఒకదానిని మాత్రమే మీకు చూపుతాను.

యుద్ధంవచ్చినతరువాతఅన్నివస్తువులధరలూ విపరీతంగా పెరిగిపోయిన సంగతి అందరికీ తెలుసును. ఆహారపదార్ధాలు ధాన్యం సరుకులు, ముడి ద్రవ్యాలు చిల్లరసామగ్రి, సముస్తమూ రెండు రెట్లూ మూడురెట్లూ కూడ పెరిగిపోయాయి. ఇతర వస్తువుల ధరల నిష్పత్తిప్రకారం పరిశీలిస్తే ధాన్యం ధర మాత్రం పెరగలేదు. యుద్ధానికిపూర్వం చింతపండుధర వీశె 1కి 0-3-0 ఇప్పుడు వీశె 1కి

0-12-0. యుద్ధంవచ్చినతరువాత చింతపండు ధర నాలుగురెట్లు పెరిగింది. అలాగే జీవితాని కవసరమూ, అందరికీ కావలసినవీ అయిన పప్పూ, ఉప్పూ మొదలయిన సరుకులన్నీ దినదినమూ నాలుగేసి రెట్లూ మూడేసిరెట్లూ పెరుగుతూవుండగా అన్నిటికంటె ముఖ్యమయిన ఆందరికీ ముఖ్యజీవనాధారమయిన ధాన్యంమాత్రం రెట్టింపుధరవరకే పెరిగింది. అంతకంటె యెక్కువ పెరగకుండా గవర్నమెంటు కంట్రోలుచేసింది ఆవిషయం ముదావహమే. కాని ఒక్క అన్యాయం మాత్రం వుంది. ఉభయగోదావరి కృష్ణాజిల్లాలలో ప్రత్యేకం వరి పంట అధికము. మిగిలినపంటలు లేనేలేవనవచ్చును అంటె యిక్కడ రైతులు ప్రత్యేకించి వరినే పండించాలిగాని యితర ధాన్యాలను పండించడానికి అవకాశము లేదు. వారి ఆదాయమంతా కేవలం ధాన్యం పంటమీదనే ఆధారపడివుంది. యితర పంటలు లేకపోవడమువల్ల అన్నిసరుకులూ ధాన్యం అమ్మి అతడు కొనుక్కోవలసినదే! కనీసం తన కుటుంబానికి అవసరమయ్యే పప్పుదినుసులు గాని చింతపండు వగైరా గాని పండించుకోవడానికి తగిన వసతులీ డెల్టాలోవుండే వ్యవసాయదారులకు లేవు. అందుచేత అన్నిసరుకులూ

వారు డబ్బు పెట్టికొనవలయును. అయితే వారి పొలాల్లోపండే ధాన్యంమాత్రం కంట్రోలుకేటుకు గవర్నమెంటుకు అమ్మాలి. దానిమీద వారికి యుద్ధాన్నిబట్టి పెరిగిన ధరల ప్రకారం చూస్తే యింతకుపూర్వంకంటె రెట్టింపుమాత్రమే పెరిగింది. మిగిలినవానికి నాలుగురెట్లు పెరిగింది. అందుచేత అతని ప్రత్యేకం ధాన్యంమీదవచ్చే ఆదాయం ఇతర సరుకులకే సరిపోదన్నమాట. ఈ కష్టంఒక వరిపండించే వ్యవసాయదారులకు మాత్రమే కలుగుతోంది కనుక వరిధాన్యాన్ని కంట్రోలచేసిన గవర్నమెంటు ఇతర సరుకులను కూడా కొంచెం ఇంచుమించుగా కంట్రోలుచేసి వున్నట్లయితే ఇంత నష్టం రైతులకు కలుగదు. అయితే ధాన్యం ధర ప్రకారం మిగతా వస్తువుల ధరలను తగ్గించాలి కాక మిగతావస్తువుల నిష్పత్తి ప్రకారం ధాన్యం ధరలను పెంచాలి. ఈ విధానం అవలంబిస్తేనే గాని డెల్టాలో సేద్యంచేసే కృషీవలులకు లాభం వుండదు. అయితే యిందులో మొదట సూచించిన విధానమే మంచిది. సమస్తజీవులకూ ధాన్యం అవసరంకనక దాన్ని పెంచినట్లయితే బీదసాదలూ వరిపంట పండని యితర ప్రాంతీయులు ఘోరకాటకం పాలవుతారు. అసలువారికి డబ్బు వుండదు.

డబ్బువున్నా కొనడానికి ధాన్యం సాధ్యంకాదు. అందుచేత ఇతర వస్తువుల ధరకూడా ధాన్యం మాదిరిగానే ఒక కట్టింపుమాత్రమే పెంచి ధరను కంట్రోలుచేస్తే సర్వసాధారణంగా అందరికీసుఖం కలుగుతుంది. సంతృప్తియేర్పడుతుంది. ఈ విధానంవల్ల మెట్టపంటలు పండించే వారికినష్టం కలుగుతుంది. వారిపంటలకు సరియైనధరలు రాకపోతే వారికి నిరాశ కలగడంలో ఆశ్చర్యమేముంది? ఈ సాధక బాధకాలను ఆలోచించి యిటు డెల్టా రైతులకూ, అటు మెట్టపైరు రైతులకూ ఉభయులకూ నష్టం కలగకుండా ధాన్యం ధరను మధ్యరకంగా కంట్రోలు చేయడం ఉచితం. ప్రస్తుతం ధాన్యంధర గోదావరి జిల్లాలో ఒక విధంగానూ. కృష్ణాలో మరొకవిధంగానూ గుంటూరులో వీటికంటె ఎక్కువగానూ ధర వుండడం రైతులకు నష్టమేకాకుండా ధాన్యం మార్కెట్టుకు రాకుండా వుండడానికీ-దొంగనిల్వల అభివృద్ధి పరచడానికీ-సాధనంకావున ధాన్యంధర కొనినా-అమ్మినా యావదాంధ్ర దేశంలోనూ ఒకేవిధంగా వుండాలి లేకపోతే హెచ్చుతగ్గుల ననుసరించి అసంతృప్తి యేర్పడుతుంది. ధాన్యాన్ని అమ్మరు. అమ్మక

పోతే గవర్నమెంటు అధికార రీత్యా కమాండరీ చేయడానికి పూనుకొంటుంది. ఈకమాండరీ విధానంవల్ల రైతు తన జీవితావసరాని కుంచుకొన్న ధాన్యంకూడా గవర్నమెంటు హస్తగతమవుతుంది. ఇందువల్ల పంటపండించిన ఉత్పత్తిదారునకే కరువు రావడానికి అవకాశముంటొంది. అతని భోజనపు ఖర్చులకు కావాలి, కూలివాండ్లకు కావాలి. జీతగాండ్లకుకావాలి. ఈఅంచనా తెలియకుండా ఉన్న ధాన్యంఅంతా గవర్నమెంటు బలవంతంగా తీసుకుపోతే అతనికి కరువుకాక మరేమిటి? అందుచేత ధాన్యం ధరను అందరికీ సంతృప్తికరంగా వుండే పద్ధతిలో కంట్రోలు చేయుడం గవర్నమెంటు వారి విధాయక కృత్యము. రైతులకందరకూ లాభకరము బ్లాక్ మార్కెట్టునూ, దొంగ సిల్వలనూ, రూపుమాపడానికి ప్రజాయుధము. యీమధ్య ఆంధ్రరాష్ట్ర రైతుసంఘమువారు (రిజిష్టర్డు) సూచించిన రీతిగా ధాన్యంధరకనీసం పంద్రెండురూపాయలునా వుండాలి. ఈధాన్యం అమ్ముకొని రైతు సమస్తవస్తువులనూ కొనుక్కోవాలంటే బట్టలు మొదలయిన కుటుంబావసరాలను కూర్చు కోవాలంటే ఆ ధర అయినా లేకపోతే రైతుకు లాభంలేదు. కానప్రస్తు

తం కొంచంతక్కువగా పండ్రెండు రూపాయలధర గుంటూరుజిల్లాలోవుంది. పదకొండు రూపాయలను తక్కువగా కృష్ణాలోవుంది ఈ తేడావల్ల రైతులకూ కూడ నష్టంగావుంది. కావున ఈ తేడాలు లేకుండా అన్నిజిల్లాలలోనూ ధాన్యంధర ఒకే విధంగావుండే పద్ధతి ఆలోచించడం ఇతర వస్తువుల ధరకు కూడా సాధ్యమైనంత వరకు కంట్రోలు చేయడం గవర్న మెంటువారి విధి. సత్వరంగా ఈ విధానం అమలు జరిపించడానికి రైతులోకం యావత్తూ సక్రమాం దోళన జరపడానికి, రైతుసంఘంవారి సూచనలను ఆమోదించడానికీ తయారుగా వుండాలి

కేవలం ఆహారపదార్ధాలకేగాకుండా యితర మయిన జీవితావసర వస్తువులకు కూడా ధర కం ట్రోలుచేయబడి వుండాలి. పశువులు వ్యవసాయా నికి ముఖ్యావసరంగదా? రైతుకు పశు సంపత్తి లేనినాడు కృషిసాధ్యంకాదు ఆపశువులకుముఖ్యం గా అవసర మయినది. వులవలు తప్పడు వగ యిరాల పదార్ధాలు విపరీతంగా పెరగడం జిల్లాకొకరీతిగా వుండడం చాలా హానికరమయిన విషయం. ఆమధ్య ఉలవలకు కృష్ణాజిల్లాలోధర అమితంగా పెరిగినది. సరిహద్దులోనున్న పశ్చిమ

గోదావరిలో ధర సామాన్యంగావుంది అయితే ఆ జిల్లానుండి యీజిల్లాకు సరకు రవాణాను గవర్నమెంటు నిషేధించింది ఈనిషేధంలాంటివి తొలగాలి. ఎక్కడ చౌకగా విరివిగా లభ్యమవుతాయో అక్కడనుంచి తెచ్చుకోడానికి గవర్నమెంటు అనుమతించాలి లేదా-ధర సర్వసామాన్యంగా వుండేటట్లు కంట్రోలు చేయాలి.

వ్యవసాయదారులు తమకుటుంబాల సరాలకు అవసరమయిన వస్తువుల నన్నిటినీ కోఆపరేటివ్ స్టోర్సులోనే కొనుగోలు చేయడం ఉచితం. పెద్దవర్తకుని దగ్గరనుంచి చిల్లరవానిరకూ ప్రతీ వస్తువుమీద విపరీతమయిన లాభాన్ని వేసికొని గోంగూర మొక్కలు గోధుమలువరకూ-యుద్ధాన్ని సాకుగాచెప్పి అధికలాభాన్ని గుంజుకొంటున్నారు. అయితే ధర అధికంగా వుందని కొనడం మానతాడా! కనుక స్వార్థపరుల అధికలాభాలకు అరికట్టాలంటే రైతులందరూ ప్రతీగ్రామంలోను కోఆపరేటివ్ స్టోర్సును నెలకొల్పుకొని సంఘీభావంతో-ఆ సంఘాన్ని స్వార్థపరుల చేతిలోపెట్టకుండా న్యాయముగానడిపేటట్టు చేసి ఆసంఘాలలోనే తమ కవసరమయిన వస్తువులను ఖరీదుచేసి నట్లయితే యీ

విపరీత లాభాలను గుంజుకొంటున్న స్వార్థపరు లయిన వర్తకులకు ఆటలు కట్టుతాయి. సామా న్యులకు చౌకగా లభిస్తాయి ముఖ్యంగా సమస్త వస్తువులూ లభ్యమవుతాయి కొన్ని వస్తువలను వ్యక్తి పరంగా ఇవ్వడానికి గవర్న మెంటు లైసెన్సు ఇవ్వదు కాని. సంఘాలకు అన్ని వస్తువులనూ తెప్పించుకొనే అధికారం వుంటుంది. కనక రైతులందరూ తమ గ్రామాల్లో కోఆపరేటివ్ స్టోర్సు నెలకొల్పుకొని సంఘీభావంతో దానివల్ల లాభపొందడం శ్రేయోదాయకము. భోజన పదా ర్థాలు పండక పండినవి చాలక. ఒక వేళ ఉన్నా హెచ్చుధరలు పెట్టికొనుక్కో లేక-ధనమున్నా వస్తు వులు దొరక్క-చాలావుంది. కరువుచేత బాధపడు తున్నారు. ఆకగువును నివారణ చేయడానికి కూడా రైతులు సిద్ధంగావుండాలి. కాము అధిక లాభాలను ఆశించి తమవద్ద ధాన్యాన్ని నిల్వజేసి కోవడం అనుచితమయిన కార్యము. తమ అవసరా నికి సరిపోయేటంత సరుకే తమయొద్ద వుంచుకొని మిగిలిన సరుకు సరసమయిన ధర లభింపగానే విడు దల చేయడం కూడా చాలాఅవసరం. పరోప కారంతోకూడినపని. తోడిమానవ సంతతికోసం

దిక్కు లేక- అన్నం లేక, ఆహారపదార్థాలు లేక, మలమలమాడుతూవుంటే తాముఅధికలాభాలనుద్దే శించి సరుకునిల్వచేసికోవడం కేవలం స్వార్థపరత్వం.

రైతులందరూ సంఘీభావంతో స్వక్షేమాం దోళన జరపడానికీ- సన్యాయమయిన తమహక్కులను సంరక్షించు కోవడానికీ,తమ వృత్తులనాలోచిం చుకోవడానికీ సంఘాలు, మంచివని మనకందరికీ తెలుసు. అయితే యీసంఘాలలో పీడిత ప్రజానీ కానికి స్వార్థరాహిత్యంతో పనిచేయుడానికి ముం దండవేసే వారెవరో గుర్తించాలి.తమ పార్టీని తమ ఆశయాలను ప్రజల్లో వ్యాపింపచేసికోడానికి ప్రజల్లో యేదోవిధంగా స్థానం సంపాదించుకొని తమ అవసరాలను నిర్వర్తించుకోవడానికీ ఏర్పడిన సంస్థల్లో రైతులు చేరరాదు. అమాయిక రైతు సముదాయాన్ని మోసవుచ్చడానికి నిగూఢంగా వున్న తమ ఆశయాన్ని కప్పిపుచ్చి యేదో ఉప కారం పైకి గోచరించేటట్లు వున్న ఈహానా రైతు సంఘనాయకులు రైతుల ననేకవిధంగా పీల్చి తమ పొట్టల నింపుకోవడానికే యత్నిస్తారుగాని భారత దేశంలోవున్న రైతు తమ భాషిని అభివృద్ధికరం గానూ, ఆనందకరంగానూ తయారుచేసుకోడానికి

మార్గాలు ఏవి? వానిని ఏలా సాధించుకోవాలి. ఏవిధమయిన జాతీయత వారి హృదయాల్లో నాటుకోవాలి? వానిని ఆలోచించని సంఘాలున్నా మన ఆంధ్ర దేశంలో వున్నాయి. ఆసందర్భంలో రైతు తగినంత విజ్ఞానాన్ని సంపాదించుకొని యేసంఘాల ద్వారా మనం అభ్యున్నతి మార్గంలోకి పోతాం. దేనివల్ల మన రైతుసంఘం తమ జాతీయతను రక్షించుకొంటుంది ఏసంఘం స్వార్థంకొసం ఏర్పడినది? మొదలయిన విషయాలను ఆలోచించుకొని చర్చించుకొని ఆసంఘానికే తమ సానుభూతిని తెలియజేయాలి. ఆసంఘానికే తమబలాన్నంతా దోహదమివ్వాలి. ఇతరసంఘాలవారికి తగినవిధంగా బుద్ధిచెప్పి వారిని దూరంగా తరిమి వేయాలి. వారిని సర్వవిధాలా దూరంగా బహిష్కరించాలి. తమ సానుభూతిని కూడా అందజేయరాదు.

వర్తమానకాలంలో భారతదేశంలో రైతు శోచనీయమయిన స్థితిని అనుభవిస్తున్నాడుగాని పూర్వకాలంలో రైతు గ్రామానికి మకుటంలేని సార్వభౌముడు. అతడుచెప్పినది వేదవాక్కు. అతడనినది రాజశాసనం. గ్రామాల్లో యిప్పటివలె సమ

స్త్వాన్ని నశింపజేసి సర్వదాస్యాన్ని సమకూర్చేవ కులకక్షలు, మతభేదాలు, రాజకీయపార్టీలు. పూర్వం లేవు. అందరూ జాతిమత భేదం లేకుండా వరసలలో పిలుచుకొంటూ సుఖంగా కాలం గడపిన రోజులు మనతాతలు ఎరుగుదురు. ఇప్పటికి కొన్నిగ్రామాల్లో జాతిభేదాలు వర్గభేదాలు మరచి అన్యోన్యం సహృద్భావంతో మసలుతూండడం మనంకూడా చూస్తాము. ఇప్పుడు గ్రామాల్లోవున్న సంకుచిత భావం- అసహనం-ప్రజలను పీడిస్తున్న దారిద్ర్య పిశాచం ఆనాడు లేవు. గ్రామాలన్నీ సుభిక్షంగా శోభాయమానంగా వున్నట్లు మనకు గోచరిస్తాయి. ఒకనికి తిండిలేక పోతే ఉన్నవాడు వానికి కావలసిన సహాయం చెయ్యడం అతనికి అందినప్పుడు మరల యిస్తే గ్రహించడం-ఈయలేక పోతే మానుకోవడం- అంతేగాని నిర్బంధపూర్వకంగా వసూలు చెయ్యడం- వందరూపాయలు బదులు ఇచ్చి రెండువందలకు నోటు వ్రాయించుకోవడం. వాడిపశువులను వీడుకాజెయ్యడం-వీడి గడ్డివాములను మరొకడు పరశురామప్రీతి చెయ్యడం ఇల్లాంటి దురన్యాయాలు- దురంతాలు-దారుణాలు నాడు లేవు. నాగరికత విజ్ఞానం పరదేశ

వాతావరణ- మనమీద సోకినందుకు ఫలితాలు కాబోలుఇవి. కరువునూ, దరిద్ర్యాన్నిఆకలిమంటలనూ మనం ప్రస్తుతం పట్నాలలో అధికంగా చూస్తాముగాని పల్లెటూళ్లలోకి వెళ్లి చూసినట్లయితే యీకరువుగాని, ఆకలిమంటలుగాని, కనపడవు కూలోనాలో చేసికొని అందరూ గంజినీళ్లయినా త్రాగుతారు. లేకపోతే గ్రామంలోవున్న సంపన్నులు వారికి తగిన జీవనోపాధికి మార్గాన్ని చూపుతారు. కాని కొన్ని గ్రామాల్లో విదేశ విద్యాధికులు స్వార్థపరులు బుర్రకారాయుళ్ళువున్న పల్లెటూళ్లలో యీసామాజిక జీవనం ధ్వంసమవుతోంది. ఏబుర్రఖానాయుళ్లు గ్రామాల్లో పరస్పర వైరుధ్యాలు పెంచడానికి కుట్రచేస్తూ వుంటారో వాళ్ళను దరినీ చేరనీకమమున రీతిగా వారికి వారం చెప్పడం రైతులపిధి. ఆ స్వార్థపరుల మాటలకు లోబడి వారి దౌర్జన్యాలతో తాముకూడా భాగస్వాములయి పతితులైనట్లయితే రైతుజాతికి మోక్షం లేదు. సర్వదా తనవ్యవసాయానికే తన గౌరవానికే- తనదేశానికే అభ్యున్నతిని పొందించే మార్గాన్నే కృషీవలుడు వ్యాపింపజేయాలి.

ప్రపంచమందలి మానవకోటి జీవించడానికి కారణభూతుడున్నా ప్రకృతియందు స్వత

స్సిద్ధములయిన నదీపర్వత తరులతాదులకువలె తన కుగూడ ప్రత్యుపకారశూన్యమయిన పరోపకారమే సహజగుణ మని భావిస్తూ, తానెన్ని ఆపత్తులకు లోనయినా తానెన్ని యిడుమలకు అలవడినా తానెన్ని ఉపవాసాలు చేసినా లోకానికి- లోకంలో వున్న స్వార్థపరులకు సోమరిపోతులకు ధనాఢ్యులకు తన్ను సర్వవిధాలా నాశనంచేస్తున్న యితరజాతులవారికి అన్నం రావడానికి మూలపురుషుడయిన రైతుసోద రుని ప్రస్తుత స్థితిని కొంచెం పరికించండి.

సీ॥ అతివృష్టి పంటలో నధికంబు హరియింప
పన్నుభారంబునే పగిదితాల్తు
ఈతిబాధలవల్ల హీనంపు పైరులో
పెట్టుబడికి సొమ్ము పెట్టగలవె?
వర్షంబు లేకుంట వరిపైరు నశియింప
ఆలుబిడ్డలనెట్లు నాదరింతు
గ్రాసంబు శూన్యమై పాసంబు లేకుంట
పశువుల కసవు సంభావమెట్లు

తే॥ గీ॥ దినమువలసినవస్తులే తీరువచ్చు
జీవితము సుఖమయముగ జేయుటెట్లు
కటాకటా కష్టకాలంబు కలిగెనీకు
వేగిరింపకు సంతోష విధముకలుగు.

సీ॥ నిలువున పొలమున నీళ్లలో నిలబడి
మొలకల పోనీక కలుపుదీసి
మోకాట బురదను పుడమిని దున్నుచు
నాగటి కర్రును సాగదీసి
వంచిన నడుముతో బారను బైకెత్తి
గట్లను సమముగాఁగదియఁజేసి
కొడవలి చేపట్టి కూలీలతో బాటు
పైరుల కోతను పరగఁజేసి.
తే॥ గీ॥ వానలో నెండలో శ్రమపూనకుండ
కష్టమవకుండ పరులనుకనలకుండ
పంటపండించు నీపాటు పరులుసుంత
తలప లేరేల కర్షకా! ధరణియందు.
తే॥ గీ॥ భరతభూమిని లయట్టిపసిడి మూట
స్వీయహస్తాల పమిటకు జేర్చితాను
ఉపవసించును మన రైతు నోర్పుతోడ
అతని సామ్యము భువిలోన వెతకి కనము.
తే॥ సస్యలక్ష్మికి కర్షక చక్రవర్తి
తీర్చిదిద్దెడి మొనగాడు తీర్పరున్న
అన్నమే రాదు ప్రజలకు అతని గవరు
ఇందుస్వాయంబు సుంతయు పొందగలమె?
తే॥ స్వార్థరహితమై నీసేవజాతికంత
తేజము నొసంగి జీవంబు తెచ్చుచుండె

దీనితలపక్క తేలికపూని నిన్న
గౌరవింపరు కొందరు కఠినమతులు.

తే॥ గీ॥ సర్వజనులకు భోజన సౌఖ్యమిచ్చి
జీవనాధార పరతకు జీవమిచ్చి
లోకకల్యాణమొనగూర్చి లోకమందు
కీర్తిసాంద్రుడై వెలయును కృషివిధాత.

తే॥గీ॥ దేశభాగ్యంబు దీపింప దీక్షితుండు
ధాన్యరాసుల పండించు ధార్మికుండు
రైతు లోకపు వారల రక్షకుండు
వాని సేమంబు గోరని వారుగలరె!

ఆలుబిడ్డల పోషింప నలమటించి
కూలిచేసుక పొటకై గోడుపడును.
పరుల యాచింప మోసంబు పాలుపడగ
నేర్వ జాలని యతనికి నిత్యనతులు.

ధనము శాశ్వతమంచును తలచువారు
భోగమేమియు తెలియక పొంగువారు
బొర్రపెంచుక కూర్చుండి మురియువారు
గ్రుంగ జూతురు రైతువే దొంగబుద్ధి.

యశము గోరడు ధనముకై యాశలేదు
పరులసొమ్ము నపహరింప పాటుపడడు

కష్టఫలితంబు నాశించి గడపు దినము
కర్షకా! నిజోలు ధన్యుడు కలడె జగతి.
పట్నవాసంపు, సౌఖ్యాల పరతనుండి
నాగరికుల మేవ రచునటనసల్పి
అతని కష్టంపు ఫలితంబు నపహరించి
సంచరి తురు మూకులు జగతిలోన.

పారిశ్రామికంగా భారత దేశం అభివృద్ధిలోకి వచ్చినా వ్యవసాయం మాత్రం ముఖ్యాధారంగానే వుంటుంది. కృషి దేశీయులకు ముఖ్య వృత్తిమె ప్రజలకు అన్నోదకాలు రావడానికే మన దేశంలో యెక్కువ అవకాశాలున్నాయి. దేశమూ సువిశాలమైనది. జీవనదులా నిరంతరం ప్రవహిస్తూనే వున్నాయి. వ్యవసాయంలోకి రావలసిన బంజరు భూములధికంగా కనిపిస్తున్నవి దేశంలోని ఆబాలగోపాలమూ కృషిమీద ఆధారపడవలసి యున్నారు. కనుక యేనాటికైనా భారత దేశం వ్యవసాయ ప్రధానమయిన దేశంగానే పరిగణింపబడుతుంది. యంత్రాలూ-పరిశ్రమలూ- ప్రబలమయినా-రైతు తన, నాగలి, పారలతోనే కాలం గడపవలసియున్నది. అందుకనే మన దేశంలో "కృషితో నాస్తి దుర్భిక్షమ్" అను వాక్యము సార్థకమై నేటిదాక నిలబడివుంది.

ఓకృషీవలసత్తమా! పరోపకారార్థమై లోక కళ్యాణము కొరకై- స్వార్థత్యాగముతో- సమాజ క్షేమమునకై -నీయుత్తమధర్మ నిర్వహణమునందు వెనుకంజవేయకుము. త్యాగమయమైన నీచరితము కుటిలమార్గగాములగు స్వార్థపరులకు ప్రక్కలో బల్లెమై- సన్మార్గమున, జీవితమును నడిపించుకొన జాలని సోమరి పోతులకు-అంకుశమై యలరారునుగాక! దేశసేవా పరాయణుడవై దేశీయుల జీవన విధానమునకు ముఖ్యావసరములగు పంటలను పండించి మృత్యుదేవతావదన గహ్వరమున చిక్కుకొన్న-అసంఖ్యాక క్షామపీడితులను- అన్నాతురులను సంతృప్తిపరచు నీకు అచిరకాలమున- మంచి రోజులు రానున్నవి. భావిభారతమున- రైతునకే సమాజమున గౌరవము కలుగనున్నది. వేయేల రైతేరాజయి శాసించు సుముహూర్తము ఆసన్నము కానున్నది.

రైతురాజా! భారతదేశమున భావిరాజ్యాంగ విధానమున నీకు సముచితస్థానము లభించునందాక శాంతిమయమైన ఆందోళన జరపడానికి సన్నదుడవుకమ్ము. యావత్ప్రపంచమూ నీ కృపై నేడేధార పడియున్నది. భారతీయ కర్షకసముదాయమంతా ముక్తకంఠంతో-ధర్మసంస్థాపనార్థమై-దరి

ద్రనారాయణ సముద్ధరణ కొరకై-నమమును బిగి యించుట అవసరము. మీలో మీకు మొలకలెత్తు వివాదములను తలసూపనీయక బ్రహ్మాండమూ-అవిభేద్యమూ-అయిన ఐక్యతతో మీమ్మల నెదుర్కొను సమస్యలను పరిష్కరించుకొనుడు. మీ సంఘ క్షేమమునూ-మీధర్మ నిర్వహణమునూ-మీయాధర్మ పూర్తినీ-మనమందు నుంచికొని యుచితమయిన మార్గమందు గమనము చేయుడు. అచంచల విశ్వాసంతో-అకుంఠిత సేవా బుద్ధితో-అవిచలిత దేశభక్తితో-అన్యోన్య సహాకారంతో-మీ సమాజాన్ని-ఆదర్శవంతంగా తయారు చేసికొనండి స్వార్థపరులకూ కుటిల మతులకూ-మీలో స్థానం లేకుండా దూరంగా పారద్రోలండి. అనతికాలం లోనే-అవాంతరాలను ఛేదించుకొని-అత్యున్నత స్థానాన్ని-ఆరోహిస్తారు.

రైతులందరు నేడు రాజ్యాలు శాసించ
ముక్తకంఠముతోడ-ముందూకు రావాలి
రణరంగ విజయంబు సాధింపవే వేగ
కదన భూమికే నిత్య దీప్తితో-కదలంగ
కర్షకావలి తీవ్ర-ఖడ్గజ్వాల లెగయంగ
స్వాతంత్ర్య సమరాన-జయమూను కొనిరాగ

రైతులందరు నేడు-రాజ్యాలు శాసింప
ముక్తకంఠము తోడ-ముందుకు రావాలి.

రైతు గీతం.

రావోయి రావోయి రైతన్నా!
రాజ్యాలు మార్చాలి రావోయి!
రాజ్య చక్రము నీదు చేతిలో నుండాలి!
పాతరాజులకు బూజుపట్టించ లేవోయి! రా॥

పొంగిపొర్లెడి నీదు దుఃఖాగ్ని కణములో
మోసపోతుల రాజ్యమంతరించే వరకు
పదునెట్టి భావాన్ని పరుగు లెత్తించాలి రా॥
వేడిరక్తము చిలికి విజయపుధ్వజమెత్తి
విశ్వరంగా మంతవిజయగానముతోడ
విహరించ రావోయి రావోయి! రా॥
ప్రళయకాలావేళ ఫెళా ఫెళా పిడుగోలె
యుద్ధరంగమునందు విజయ గర్జనచేసి
వీరపుత్రులకీర్తి విశ్వాన వెదజల్ల, రా॥
ఖంగు ఖంగను నీదుఖడ్గాన్ని ఝళిపించి
తెగబలిసిన ... ... తెగనరక
విప్లవధ్వనులతో విశ్వంబు మార్మ్రోగ! రా॥

37113 630.174

తెనుఁగుతోటలో పూసిన పుష్పాలు

రత్నాల వీధి

యువకసింహం

రాజకీయ వ్యాసాలు

విద్యుల్లత

స్వాతంత్ర్య గీతాలు

చిట్టి ముత్యాలు (1వ భాగం)

వజ్రపుతునకలు

S. R. Thummala

రాబోవు నవలలు

జైలులో

అద్భుత విషాదములతో

నిండిన కథలు

ప్రేమ

మధుర శృంగార

కథానికలు

S. R. Thummala

27 46